

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

శుక్రవారం 27 జూన్ 2025 పేజీలు 8


# ఉద్యోగులపై నియంత్రణేది?

అంబాపురం సచివాలయంలో ఇష్టానుసారంగా సిబ్బంది పనితీరు... గ్రామస్తులపై దురుసు ప్రవర్తన




- సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో పథకాలు కోల్పోతున్నామంటూ లబ్ధిదారుల ఆరోపణలు
- సిబ్బంది పనితీరుతో విసుగెత్తిపోతున్న గ్రామస్తులు..
- వైసీపీ ప్రభుత్వం మారినా తీరుమారడం లేదంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలు
- చోద్యం చూస్తున్న పంచాయితీ సెక్రటరీ.... పర్యవేక్షించని ఎంపీడీవో

వివరాలు 2లో

## మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం : మంత్రి కొల్లు రవీంద్ర

2





మాదకద్రవ్యాల విక్రేతలూ..

## ఖబడ్దార్!



- ఉపేక్షించేది లేదు.. ఉక్కుపాదం మోపుతాం
- డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమితరిమి కొడతాం
- స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ సాకారానికి డ్రగ్స్‌ను సమాజం నుంచి దూరం చేయడం ముఖ్యం
- మెగా వాకథాన్‌లో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**ఎన్‌టిఆర్ జిల్లా బ్యూరో, జూన్ 26, మేజర్ న్యూస్ :** ఎక్కడైనా మాదకద్రవ్యాల ఆనవాళ్లు కనిపిస్తే ఉపేక్షించేది లేదని, చట్టాలు గట్టిగా ఉన్నాయని.. డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి దూరం చేసేవరకు నిద్రపోమని, విక్రేతలూ ఖబడ్దార్ అంటూ జిల్లాకలెక్టర్ డా. జి.లక్ష్మీశ గట్టిగా హెచ్చరించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో గురువారం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం నుంచి ఎంజీ రోడ్డులో మెగా వాకథాన్ జరిగింది. ప్రజలకు డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన పెంపొందించి, మాదకద్రవ్య రహిత జిల్లా, రాష్ట్రం, దేశం లక్ష్యంగా నిర్వహించిన ఈ వాకథాన్‌లో వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొని డ్రగ్స్ మహమ్మారికి వ్యతిరేకంగా నినదించారు. యువతా మేలుకో.. మత్తు మానుకో అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎన్‌టీఆర్ జిల్లా మొత్తం ఏకమై డ్రగ్స్‌పై పోరాటం చేస్తోందని..

మిగతా 2లో

కట్లేరు బ్రిడ్జ్ సమస్యకి

## రెండు నెలల్లో శాశ్వత పరిష్కారం

ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

- తిరువూరు మను గార్డెన్స్‌లో తిరువూరు ఎ.ఎమ్.సి ఛైర్ పర్సన్ గా రేగళ్ల లక్ష్మీ అనిత ప్రమాణ స్వీకారోత్సవం
- ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్, టిడిపి జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్
- ఎ.ఎమ్.సి ఛైర్ పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన రేగళ్ల లక్ష్మీ అనిత
- ఎ.ఎమ్.సి ఛైర్ పర్సన్ తోపాటు ప్రమాణ స్వీకారం చేసిన పాలకవర్గ సభ్యులు

7లో



# అంబాపురం సచివాలయంలో ఉద్యోగులపై నియంత్రణేది?




**ఇష్టానుసారంగా సచివాలయ సిబ్బంది పనితీరు... గ్రామస్తులపై దురుసు ప్రవర్తన**

**సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంతో పథకాలు కోల్పోతున్నామంటూ లబ్ధిదారుల ఆరోపణలు**

**సిబ్బంది పనితీరుతో విసుగెత్తిపోతున్న గ్రామస్తులు..**

**వైసిపి ప్రభుత్వం మారినా తీరుమారండం లేదంటూ వెల్లువెత్తుతున్న ఆరోపణలు**

**చోద్యం చూస్తున్న పంచాయితీ సెక్రటరీ....పర్యవేక్షించని ఎంపీడీవో**

**విజయవాడ రూరల్ జూన్ 26, మేజర్ న్యూస్ :** మండలం అంబాపురం పంచాయితీ కార్యాలయంలో సచివాలయ సిబ్బంది పనితీరు విమర్శలకు తావి స్తోంది. లబ్ధిదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు వినిపి స్తున్నాయి. వృద్ధులు, మహిళలు ప్రభుత్వ పథకాల సమాచారం కోసం వస్తే రోజుల తరబడి తిప్పడమే కాకుండా ప్రభుత్వ పథకాలను దూరం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్న పంచాయితీ కార్యదర్శి, ఎంపిడీవో పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు గ్రామస్తులు.

అంబాపురం పంచాయితీ పరిధిలో దాదాపు అత్యధిక మంది పేద వారే నివసిస్తున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలనే లక్ష్యంతో సచివాలయాలను కూటమి ప్రభుత్వం మరింత పటిష్టం చేస్తే సచివాలయ సిబ్బంది మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల తల్లికి వందనం డబ్బులు అంబాపురంగ్రామంలో చాలామందికి రాని పరిస్థితి. అయితే ఎందుకు రాలేదో తెలుసుకుందామని సచివాలయం కి వెళ్తే సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడమే కాకుండా పడతాయి ఆగండి లేకుంటే మీ స్కూళ్ళ కెళ్ళి అడగండి అంటూ నిర్లక్ష్య సమాధానం చెప్పుడండంతో పెదవి విరుస్తున్నారు అంబాపురం గ్రామస్తులు. అయితే ఒక్క తల్లికి వందనమే కాదు ప్రభుత్వం ప్రకటించిన పథకాల్లో అర్హులెమో కాదో చెక్ చేసుకునేందుకు వెళ్ళినా ఇదే పరిస్థితి ఎదురవుతుందని ఆరోపిస్తున్నారు గ్రామస్తులు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేలా సచివాలయాలను గ్రామాల్లోనే ఏర్పాటు చేసింది గత ప్రభుత్వం.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా సచివాలయాల్లో మరింత సేవలను సులభతరం చేసేలా చేసినా సచివాలయ సిబ్బంది మాత్రం గత ప్రభుత్వంలో మాదిరిగానే ఉద్యోగాలు చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు ప్రభుత్వ పథకం పొందేందుకు పంచాయితీ ఆఫీసుకు వస్తున్న వాళ్ళ ఆశలకు నీళ్ళు చల్లుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వృద్ధులు, మహిళలు వచ్చిన సమయంలో సీట్లో లేకపోవడం ఒకవేళ ఫోన్ చేసినా చిరాకుగా మాట్లాడుతున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అయితే పంచాయితీ సెక్రటరీకి ఫిర్యాదు చేసినా చూసిచూడనట్టుగా వదిలేస్తున్నారనే ప్రచారం జరుగుతుంది. సిబ్బంది పనితీరు పర్యవేక్షణ చేయాల్సిన ఎంపిడీవో సైతం అంబాపురం పంచాయితీ పట్ల కొంత సానుకూలంగా ఉండడంపై విమర్శలకు తావిస్తోంది. కలెక్టర్ జోక్యం చేసుకొని అంబాపురం పంచాయితీ లో దురుసుగా ప్రవర్తించే సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు అంబాపురం గ్రామస్తులు. చూడాలి ఇప్పటికైనా గ్రామస్తులకు ప్రభుత్వ పథకాలు లబ్ధిచేకూరిలే వ్యవహరిస్తారో లేక సచివాలయ సిబ్బందినే వెనకేసుకొస్తారోననేది.

# మాదకద్రవ్యాల విక్రేతలూ.. ఖబడ్దార్!

**(మొదటిపేజీ తరువాయి)**

డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి తరిమితరిమి కొడతామని పేర్కొన్నారు. విషం తీసుకుంటే ఒకేసారి ప్రాణం పోతుందని.. అదే మాదకద్రవ్యాలు అయితే వాటిని తీసుకున్న మనిషిని, ఆ కుటుంబాన్ని నాశనం చేస్తుందని, చివరకు సమాజానికి కీడు జరుగుతుందని వివరించారు. వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాకారానికి డ్రగ్స్‌ను సమాజం నుంచి దూరం చేయడం ముఖ్యమన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందుకు ఈగల్ క్లబ్స్‌తో పాటు క్యాంపస్ అంబాసిడర్లను నియమిస్తున్నామని వివరించారు. మీ చుట్టుపక్కల ఎక్కడైనా డ్రగ్స్ విక్రమిస్తున్నా, తీసుకుంటున్నా సమీప పోలీస్ స్టేషన్ లేదా సచివాలయంలో సమాచారం అందించాలని, ఈగల్ టోల్‌ఫ్రీ నంబరు 1972 కూడా అందుబాటులో ఉందని తెలిపారు. కౌన్సెలింగ్ సేవలతో పాటు డీ అడిక్షన్ సెంటర్ కూడా సేవలందిస్తున్నట్లు వివరించారు.

**విష వలయంలో చిక్కుకోవద్దు.. భవిష్యత్తు అంధకారమవుతుంది: సీపీ ఎస్వీ రాజశేఖరబాబు**

యువత డ్రగ్స్ విష వలయంలో చిక్కుకోవద్దని, మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారమవుతుందని పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు అన్నారు. డ్రగ్స్ రహిత జిల్లా, రాష్ట్రం కోసం ఈ మెగా వాకథాన్ తొలి అడుగని, చేయీచేయీ కలిపి సమష్టి భాగస్వామ్యంతో డ్రగ్స్ భూతాన్ని తరిమికొడదామని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతోందని.. పిట్ ఎన్‌డీపీఎస్ చట్టాన్ని సైతం ప్రయోగించడం జరుగుతోందన్నారు. ఈ చట్టం కింద 11 మందికి సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఇప్పటికే అయిదుగిరిపై ఈ చట్టాన్ని ప్రయోగించినట్లు వివరించారు. ఈ చట్టం ద్వారా విచారణ లేకుండా దాదాపు ఏడాదిపాటు జైలుపాలయ్యే పరిస్థితి ఉంటుందని, చాలా కఠినంగా వ్యవహరిస్తున్నామనే సందేశాన్ని అసాంఘిక శక్తులకు చెప్పేందుకు ఈ వాకథాన్ నిర్వహించినట్లు తెలిపారు. మాదక ద్రవ్య రహిత సమాజం లక్ష్యంగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామని, చివరి కేజీ గంజాయిని సైతం నిర్మూలించే వరకు నిద్రపోమని సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

**ఇది ప్రతి ఒక్కరి సమస్య: శాసన సభ్యులు గద్దె రామ్మోహన్**

డ్రగ్స్ మహమ్మారి అనేది ప్రతిఒక్కరి సమస్య అని.. దీన్ని సమాజం నుంచి దూరం చేసేందుకు సమష్టి కృషి అవసరమని విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరం కృషిచేద్దామని పిలుపునిచ్చారు. ప్రజలందరినీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని.. మాదకద్రవ్యాలతో మనిషి




నిర్వీర్యమవడంతో పాటు సమాజంపైనా ప్రతికూల ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల యెడల జాగ్రత్తగా వ్యవహరించాలని, డ్రగ్స్ దుష్పరిణామాలను వివరించి చెప్పాలని, డ్రగ్స్‌పై పోరాటంలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా నేను సైతం నా జీవితంలో ఎప్పుడూ మాదక ద్రవ్యాలు వాడనని.. నేను, నా సమాజాన్ని మాదక ద్రవ్యాల నుంచి రక్షించేందుకు, మాదక ద్రవ్యాలను దూరం చేయడంపై దృష్టిపెడతానంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఆర్‌డీవో కావూరి చైతన్య, డీసీపీలు కేజీవీ సరిత, ఏబీటీఎస్ ఉదయరాణి, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ కె.దామోదర్ రావు, డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా. కొల్లేటి రమేష్, వివిధ కళాశాలల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు.

# మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణ లక్ష్యం కోసం అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నగరంలోని సాయిబాబా గుడి వద్ద నుంచి జిల్లా పరిషత్ సర్కిల్ వరకు నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి కొల్లు రవీంద్రతో పాటు ఐజీ అశోక్ కుమార్, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, అధికారులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొని మత్తుతో మనిషి జీవితం నాశనం.మత్తుకు దూరంగా ఉందాం, బంగారు భవిష్యత్తుకు దగ్గరగా ఉందాం.. అంటూ మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పలు నినాదాలు చేసుకుంటూ జిల్లా పరిషత్ కూడలి వైపు సాగారు.. కూడలి వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నాయన్నారు. సమాజంలోని యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగంతో మత్తుకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం ఒక సబ్ కమిటీని ఏర్పాటు చేసిందని, మంత్రి నారా లోకేష్, హోం, వైద్య ఆరోగ్య తదితర శాఖల మంత్రులతో పాటు తానూ ఈ కమిటీలో సభ్యుడిగా ఉన్నానని తెలిపారు. అదేవిధంగా పోలీస్, ఎక్సైజ్ శాఖలతో ఈగల్ టీంల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని, త్వరలో ప్రతి జిల్లాలోనూ ఈ బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తన, వారి కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని, వారి



భవిష్యత్తు తీర్చిదిద్దే క్రమంలో అవసరం మేరకు వారితో కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాలను వినియోగిస్తూ సమాజానికి చేటు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అట్టివారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలుపుదల చేసే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. మచిలీపట్నంలో ఎక్కడ కూడా మాదకద్రవ్యాలను వినియోగించకుండా ప్రభుత్వ యంత్రాంగంతో పాటు ప్రజలు సహకారం అందించాలని, వాటి వినియోగంపై ఎలాంటి సమాచారం ఉన్నా ప్రభుత్వానికి అందించాలని కోరారు.ఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రధాన సమస్యగా ఉన్న గంజాయి వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఈగల్ టీములను ఏర్పాటు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటూనే, మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దులోని ఏజెన్సీ ప్రాంతాలలో గంజాయి సాగు చేస్తున్న వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం వారికి ఇతర ఉపాధి మార్గాలు చూపించడంతో గంజాయి సాగు చాలా వరకు తగ్గిపోయినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి యువతే శక్తి అని, అట్టి యువత మత్తుకు బానిస కావడం బాధాకరం అన్నారు. వారి వల్ల కుటుంబం మొత్తం బాధపడుతుందని, మత్తుకు బానిసైన వారిని సాధారణ స్థితికి తీసుకురావడానికి ఎంతో శ్రమించాల్సి వస్తుందన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ టీమ్ లను ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. మత్తు పదార్థాల జోలికి పోకుండా ఉండేందుకు తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నప్పటికీ పిల్లలతో స్నేహపూర్వకంగా మెలగాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలకు ఎలాంటి సమాచారం ఉన్నా 1972 కాల్ సెంటర్కు వివరాలు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అభివృద్ధిలో యువతది కీలక పాత్ర అని, అట్టి యువత మత్తుకు బానిస అయితే దేశం అభివృద్ధిలో వెనుకబడిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యువత మత్తు పదార్థాల వినియోగానికి దూరంగా ఉండాలని, చదువులో రాణించడంపై దృష్టి పెట్టి జీవితంలో ఎదగడానికి దృష్టి పెట్టాలన్నారు. జీవితంలో స్థిరపడి పది మందికి ఉపాధి కల్పించే విధంగా ఉన్నత లక్ష్యాలను కలిగి ఉండాలని సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు ఈగల్, శక్తి బృందాలతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను నిత్యం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మాదకద్రవ్యాలను నియంత్రించడంలో ప్రభుత్వానికి ప్రజలు తమ వంతు సహకారం అందించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ సమాజాన్ని పట్టి పీడిస్తున్న ప్రధాన సమస్య అయిన మాదకద్రవ్యాలను నియంత్రించడంలో పోలీస్, ఎక్సైజ్ శాఖది కీలక పాత్ర అని పేర్కొన్నారు. ఈ నియంత్రణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, మాదకద్రవ్యాల దుర్వినియోగంపై ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వై వీరయ్య బృందం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను జానపద గీతాలతో ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కె చంద్రశేఖర రావు, బందరు ఆర్డీఓ కే స్వాతి, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, మెప్మా పీడీ సాయిబాబు, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, పశు సంవర్ధక శాఖ అధికారి చిన నరసింహులు, ఐ ఆర్ సి ఎస్ కార్యదర్శి డాక్టర్ శంకర్నాథ్, మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నాయకులు కుంచే నాని, ఇతర ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితి అనేది కాంగ్రెస్ అధికార దాహంతో అన్యాయం చేసిన యుగం




**విజయవాడ, జూన్ 25, మేజర్ న్యూస్ :** 1975, భారతదేశ రాజ్యాంగ చరిత్రలో ఒక తేదీ మాత్రమే కాదు, అధికార దాహంలో ప్రజాస్వామ్యం యొక్క ఆత్మ నలిగిపోయిన చీకటి రోజు. ఇది కేవలం 'అత్యవసర పరిస్థితి' కాదని, అధికార దాహంతో ఉన్న కాంగ్రెస్ తన సింహాసనాన్ని కాపాడుకోవడానికి చేసిన చివరి, తీరని ప్రయత్నం అని, జాతీయ భద్రత అనే తప్పుడు సాకుతో దేశంపై బలవంతంగా రుద్దబడిన అన్యాయ కాలం అని కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి, సీనియర్ బిజెపి నాయకుడు అమిత్ షా నిస్సందేహంగా స్పష్టం చేశారు.ఈ చీకటి అధ్యాయం భావ ప్రకటనా స్వేచ్ఛను గొంతు నొక్కడమే కాదుబీ అది న్యాయవ్యవస్థను చెవిటివాడిని చేసి, పత్రికలను మసకబారింది. 21 నెలల పాటు, ఈ ప్రజాస్వామ్య వ్యతిరేక నిశ్శబ్దం మొత్తం దేశంపై వ్యాపించి, భారత పౌరులను వారి స్వంత భూమిలో ఖైదీలుగా మార్చింది. భారత ప్రభుత్వం ఈ రోజును 'సంవిధాన్ హత్య దివాస్' (రాజ్యాంగ హత్య దినం)గా పాటించాలని నిర్ణయించుకున్నప్పుడు, అది ప్రజాస్వామ్య విలువల రక్షణలో జాతీయ మేల్కొలుపు. దేశం మొత్తం భయం, అణచివేత గుప్పిట్లో ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితి యొక్క అణచివేత చీకటి మధ్య, నేడు భారత ప్రధానమంత్రి అయిన ఒక యువ ప్రచారక్, భూగర్భంలో నివసిస్తున్నప్పుడు ప్రజాస్వామ్య జ్యోతిని పైకి ఎత్తాడు. మారువేషాల్లో, కొన్నిసార్లు సన్యాసిగా, కొన్నిసార్లు వార్తా పత్రిక విక్రేతగా, అతను ప్రజా మేల్కొలుపు స్ఫూర్తిని రగిలించాడు. నేడు, ఆ నాయకుడే 140 కోట్ల మంది భారతీయుల విశ్వాసం, ఆకాంక్షలు, ఆశల స్వరూపుడు. ఇది కేవలం చారిత్రక వ్యంగ్యం కాదు – ఇది కవితా న్యాయం. 'నేనే సర్వోన్నతుడిని' అనే మనస్తత్వంతో బాధపడుతున్న యుగం నుండి 'అన్నింటికంటే ఉన్నతమైన దేశం' అనే పిలుపు ప్రజల మనస్సాక్షిగా మారిన కొత్త యుగానికి మార్పు. ప్రధాని మోదీ ప్రజాభిప్రాయాన్ని సూచిస్తే, ఆయన అత్యంత విశ్వసనీయ వ్యూహకర్త, ప్రజాస్వామ్యానికి దృఢమైన రక్షకుడు, ఆధునిక భారతదేశ చాణక్య అమిత్ షా, ప్రజాస్వామ్యాన్ని కేవలం ఒక వ్యవస్థగా కాకుండా, భారతీయ జీవన విధానంలో అంతర్భాగంగా చూసే ఆ స్ఫూర్తికి అప్రమత్తమైన సంరక్షకుడు. 'సంవిధాన్ హత్య దివాస్' అనే జాతీయ కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగం కేవలం ప్రసంగం కాదు, అది ప్రజాస్వామ్యానికి పునర్నిర్వచనం. జూన్ 24, 1975 రాత్రి భారత చరిత్రలో అత్యంత చీకటి రాత్రి అని, ఆ రాత్రి ప్రజాస్వామ్యం 21 నెలల పాటు మసకబారిపోయిందని ఆయన దేశానికి గుర్తు చేశారు. వంటగది మంత్రివర్గం ఆదేశం మేరకు, పార్లమెంటు లేదా క్యాబినెట్ ఆమోదం లేకుండా, ఒకే సంతకం రాజ్యాంగాన్ని మసకబారింది. రాజ్యాంగ సభను రూపొందించడానికి 2 సంవత్సరాలు, 11 నెలలు, 18 రోజులు పట్టిన అదే రాజ్యాంగం, ఒక డిక్రీతో కుంటుపడింది. 1.10 లక్షలకు పైగా రాజకీయ, సామాజిక కార్యకర్తలను జైలులో పెట్టారు, 1 కోటి మందికి పైగా పౌరులను బలవంతంగా క్రిమిరహితం చేశారు, 253 మంది జర్నలిస్టులను అరెస్టు చేశారు. సెన్సార్‌షిప్ పత్రికలను ఎంతగా దెబ్బతీసిందంటే, వార్తాపత్రికల సంపాదకీయ పేజీలు ఖాళీగా ముద్రించడం ప్రారంభమైంది. సంబంధిత ప్రశ్న ఏమిటంటే, దేశం నిజంగా ప్రమాదంలో ఉందా? లేదా సింహాసనం జారిపోతుందా? నేడు, చరిత్రే దీనికి సమాధానం ఇస్తుంది. ఈ సంక్షోభం ఎప్పుడూ దేశం గురించి కాదు, ఇది ఒక కుటుంబ శక్తి మనుగడ గురించి. కొన్ని పార్టీలు ఇప్పుడు రాజ్యాంగాన్ని రక్షించడం గురించి పదే పదే మాట్లాడుతుండగా, 1975లో దానిని హత్య చేసిన చేతులు ఒకటేనని గుర్తుంచుకోవాలి. పార్లమెంట్, న్యాయవ్యవస్థ, పత్రికలు అన్నీ లొంగదీసుకోవడానికి ప్రయత్నించబడ్డాయి. ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని సమర్థిస్తున్న పార్టీలు అప్పట్లో పాలనతో నిలబడి దాని నుండి ప్రయోజనం పొందాయి. కాంగ్రెస్ రాజకీయ క్షీణత ఆ యుగంలో ప్రారంభమైందనేది కూడా చారిత్రక సత్యం, ఈ క్షీణత ఇప్పుడు దానిని అసంబద్ధత అంచుకు తీసుకువచ్చింది. అత్యవసర పరిస్థితి కేవలం చరిత్ర పుస్తకాలలో ఒక అధ్యాయం కాదు, ప్రజాస్వామ్యానికి ఎల్లప్పుడూ అప్రమత్తమైన సంరక్షకులు అవసరమని ఇది ఒక హెచ్చరిక. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో, భారతదేశం 'వలసవాద మనస్తత్వం' నుండి విముక్తి పొందాలని ప్రతిజ్ఞ చేసింది. గతంలో జరిగిన తప్పులను మనం గుర్తుంచుకోవడమే కాకుండా వాటి నుండి నేర్చుకున్నప్పుడే ఆ ప్రతిజ్ఞ నెరవేరుతుంది. నేడు, భారతదేశం 'నేను' కాదు, 'మనం' అనే స్ఫూర్తితో నాయకత్వం వహించే యుగంలోకి అడుగుపెట్టింది., ఈ పరివర్తన కేవలం రాజకీయం కాదు, ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని సాంస్కృతిక, జాతీయ స్పృహ యొక్క పునరుజ్జీవనం.

## 2025 బెస్పోక్ ఏఐ ఉపకరణాలను ఆవిష్కరించిన సామ్‌సంగ్




**విజయవాడ, జూన్ 25, మేజర్ న్యూస్ :** భారతదేశంలో అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ సామ్‌సంగ్, తమ 2025 బెస్పోక్ ఏఐ ఉపకరణాల శ్రేణిని పరిచయం చేసింది. ఏఐతో జీవితాలను సుసంపన్నం చేయడానికి, సరళీకరించడానికి ఈజీ, కేర్, సేవ్, సెక్యూర్ అనే నాలుగు విభిన్న వినియోగదారు ప్రయోజనాలపై నిర్మించబడింది. ఈ అనుభవాలు సామ్‌సంగ్ యొక్క కొత్త ఏఐ హోమ్ స్క్రీన్ ఇంటర్‌ఫేస్, రెండు మార్గాల సహజ కమ్యూనికేషన్‌తో కూడిన బిక్స్బీ వాయిస్ అసిస్టెంట్, సామ్‌సంగ్ నాక్స్ భద్రత, సౌకర్యవంతంగా స్మార్ట్‌థింగ్స్ కనెక్టివిటీ ద్వారా శక్తిని పొందుతాయి. ఆధునిక భారతీయ గృహాలకు అత్యున్నతంగా వ్యక్తిగతీకరించిన, శక్తి సమర్థవంతమైన, సురక్షితమైన స్మార్ట్ హోమ్ సొల్యూషన్‌లను అందిస్తాయి.

## 3-ఇన్-1 అడ్వాంటేజ్‌తో బజాజ్ ఫిన్ సర్వ్ ఎఎంసి స్మాల్ క్యాప్ ఫండ్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** క్వాలిటీ, గ్రోత్, విలువను అందించే స్మాల్ క్యాప్ షేర్లలో ప్రధానంగా ఇన్వెస్ట్ చేసే ఓపెన్ ఎండెడ్ ఈక్విటీ స్కీమ్ బజాజ్ ఫిన్సర్వ్ స్మాల్ క్యాప్ ఫండ్ ను ప్రారంభించినట్లు బజాజ్ ఫిన్సర్వ్ ఏఎంసీ ప్రకటించింది. ఈ ఫండ్ ఈ నెల 27న సబ్స్క్రిప్షన్ కోసం ప్రారంభమై, జూలై 11న ముగుస్తుంది. స్మాల్ క్యాప్స్ లో ఇటీవలి దిద్దుబాటు దీర్ఘకాలిక ఇన్వెస్టర్లకు ఆకర్షణీయమైన ఎంట్రీ పాయింట్ ను అందిస్తుంది. 80 శాతానికి పైగా స్మాల్ క్యాప్ కంపెనీలు 38 శాతం బలమైన లాభాల గ్రోత్ ను, సాలిడ్ రిటర్న్ రేషియోలను నమోదు చేసినప్పటికీ, వాటిలో చాలా వరకు ఇప్పటికీ 52 వారాల గరిష్టానికి 15–45 శాతం దిగువన ట్రేడవుతున్నాయి. ఈ తాజా మార్కెట్ కరెక్షన్ ఈ కంపెనీల వాస్తవ విలువకు, వాటి ప్రస్తుత మార్కెట్ ధరలకు మధ్య స్పష్టమైన అంతరాన్ని తెరిచింది.

## జీ తెలుగు అందిస్తున్న సూపర్ హిట్ సినిమా 'తండేల్'..

### ఈ ఆదివారం సాయంత్రం 6 గంటలకు!




**అమరావతి, జూన్ 25, మేజర్ న్యూస్ :** వారం వారం సరికొత్త సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఈ వారం మరో సూపర్ హిట్ సినిమాతో మీ ముందుకు రానుంది. థియేటర్లో ప్రేక్షకులను ఆకట్టుకున్న సూపర్ హిట్ మూవీ 'తండేల్' ని ఈ వారం వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది. నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటించిన చక్కని ప్రేమకథ 'తండేల్' ఈ ఆదివారం (జూన్ 29) సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో మాత్రమే! చందూ మొండేటి దర్శకత్వంలో బన్నీవాసు నిర్మించిన 'తండేల్' సినిమా ప్రతిష్టాత్మక గీతా ఆర్ట్స్ బ్యానర్పై రూపొందింది. ఈ సినిమా 2018లో శ్రీకాకుళం చేపల వేటగాళ్ల జీవితాల్లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కింది. మనసుని హత్తుకునే ప్రేమకథతోపాటు యాక్షన్, దేశభక్తి నేపథ్యంలో రూపొందిన ఈ సినిమా కథ రాజు (నాగ చైతన్య) అనే చేపల వేటగాడు, అతని బాల్య స్నేహితురాలు సత్య (సాయి పల్లవి) జీవితాలతో ముడిపడి ఉంటుంది. ఒక భయంకర తుఫాను కారణంగా రాజు వెళ్లిన బోటు విదేశీ జలాల్లోకి చేరడంతో అతను పాకిస్తాన్ అధికారుల చేతిలో బందీ అవుతాడు. పాకిస్తాన్ నుంచి రాజు ఎలా తిరిగి వచ్చాడు? రాజుని విడిపించడానికి సత్య ఏం చేసింది? అనే ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే ఈ ఆదివారం జీ తెలుగులో ప్రసారమయ్యే 'తండేల్' సినిమా చూడాల్సిందే! ఈ సినిమాలో నాగ చైతన్య తన కెరీర్‌లోనే అత్యుత్తమ నటనను ప్రదర్శించగా, సాయి పల్లవి నటన ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంది. నాగచైతన్య, సాయిపల్లవి ప్రధానపాత్రల్లో నటించగా, పృథ్వీరాజ్, కల్పలత, కరుణాకరన్ ఇతర ముఖ్యపాత్రల్లో నటించారు. ఈ ఆదివారం ప్రసారమయ్యే 'తండేల్' సినిమాని కుటుంబ సమేతంగా మీ జీ తెలుగు వేదికగా తప్పకుండా చూడండి! అంతేకాదు, జీ తెలుగు తన ప్రేక్షకులకు అదిరిపోయే బహుమతులు గెలుచుకునే అవకాశం కల్పిస్తోంది. తండేల్ మూవీ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ సందర్భంగా రేడియో సిటీతో కలిసి 'జీ తెలుగు–రేడియో సిటీ తండేల్ కాంటెస్ట్'ని రన్ చేయబోతోంది. శ్రోతలు ఈ కాంటెస్ట్లో పాల్గొనాలంటే సాయంత్రం జూన్ 24 నుండి 28 వరకు సాయంత్రం 7 నుంచి 8 గంటల సమయంలో రేడియో సిటీలో తండేల్ సినిమా గురించి అడిగే అడిగే ప్రశ్నలకు 9586060601 వాట్సాప్ ద్వారా సమాధానాలు పంపించాలి. ఈ కాంటెస్ట్లో గెలుపొందిన విజేతలను జూన్ 29న సాయంత్రం 6 గంటల నుంచి తండేల్ సినిమా ప్రసార సమయంలో ప్రకటిస్తారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ పోటీలో పాల్గొనండి, అదిరిపోయే బహుమతులు గెలుచుకోండి!

### స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ ద్వారా

## గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత మెరుగుదల



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమం కింద గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కలెక్టరేట్లోని తన చాంబర్ లో జిల్లా కలెక్టర్ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంపై జిల్లా పంచాయితీ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమం, వైద్య, విద్య, ఆర్డబ్ల్యూఎస్, గ్రామ వార్డు సచివాలయాలు తదితర శాఖల అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, స్థిరమైన గ్రామీణ సమాజాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఎంపిక చేయబడిన 54 పంచాయితీలలోని గ్రామాలలో అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్మాణం, ఇంకుడు గుంతల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, ప్రార్థన మందిరాలు తదితర ప్రజా ప్రదేశాల వద్ద మరుగుదొడ్లు ఇతర వసతులు ఏర్పాట్లు ఉండాలని, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టే విధంగా సంబంధిత శాఖల అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో సందర్శించి తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. త్వరలో కేంద్ర బృందం జిల్లాలోని ఆయా గ్రామాలలో పర్యటించి సర్వే చేసిన వివరాల ఆధారంగా ర్యాంకులు ఇస్తారని, మంచి ర్యాంకులు సాధించేందుకు సమన్వయంతో అధికారులు శాయశక్తుల కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ జె అరుణ, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శర్మిష్ఠ, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, డీఈఓ పీవీజే రామారావు, డిప్యూటీ జెడ్పీ సీఈవో ఆనంద్ కుమార్, మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానంద, డీఎల్డీవోలు తదితరులు పాల్గొన్నారు.




## భారతదేశానికి శుభ్రమైన ఇళ్ల పట్ల ఉన్న మక్కువను వెల్లడించిన డైసన్ అధ్యయనం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** వెట్ క్లీనింగ్ అలవాట్లు, ప్రవర్తనలు, ప్రజలు తమ వెట్ క్లీనింగ్ పరికరాలతో ఎదుర్కొంటున్న చిరాకులతో పాటు, మనం ఆశించే పరిశుభ్రమైన ఇళ్లను అందించేలా మన ఉత్తమ ఉద్దేశ్యాలను ఎందుకు సాధ్యం కావడం లేదు అనే అంశంపై సమగ్ర దర్యాప్తు చేసి డైసన్ తన మొదటి గ్లోబల్ వెట్ క్లీనింగ్ స్టడీ ఫలితాలను ప్రకటించింది. భారతీయ గృహాలు తరచూ శుభ్రం చేస్తున్నప్పటికీ, ప్రస్తుతం వినియోగిస్తున్న పరికరాలు, అలవాట్లు ఇళ్లను శుభ్రంగా కాకుండా తక్కువ పరిశుభ్రంగా మారుస్తున్నాయని గ్లోబల్ అధ్యయనం తేటతెల్లం చేసింది. కఠినమైన ఫ్లోర్లు భారతీయ ఇళ్లలో ఆధిపత్యం చెలాయిస్తుండగా, 94.5 శాతం మంది ప్రజలు టైల్స్, రాయి లేదా కలపతో చేసిన ఫ్లోరింగ్‌ను కలిగి ఉన్నారని అధ్యయనం ద్వారా గుర్తించారు– ఇవి ధూళిని సులభంగా ఆకర్షించే, తరచుగా తడి శుభ్రపరచడం అవసరమయ్యే పదార్థాలు. అయితే, సాంప్రదాయ మాప్‌లు, బకెట్లు, వస్త్రాలతో సహా శుభ్రపరిచేందుకు అనుసరిస్తున్న ప్రముఖ పద్ధతులు ధూళిని తొలగించడం కన్నా, వ్యాప్తి చేస్తున్నాయి అని అధ్యయనం ద్వారా వెల్లడైంది.

## రఘురాంకు శుభాకాంక్షలు తెలిపిన కైలే



**పామర్రు జూన్ 26 మేజర్ న్యూస్:** రాష్ట్ర శాసనమండలి సభ్యులు తలశిల రఘురాం జన్మదినం సందర్భంగా పామర్రు మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం గన్నవరం విమానాశ్రయంలో రఘురాంను కలిసిన అనిల్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## మొవ్వలోప్రారంభమైననట్టల నివారణ మందు పంపిణీ



**మొవ్వ జూన్ 26 మేజర్ న్యూస్:** మొవ్వ ప్రాంతీయ పశు వైద్యశాల ప్రాంగణంలో గురువారం గొర్రెలకు మేకలకు ఉచిత నత్తల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వచ్చేనెల 10వ తారీఖు వరకు 15 రోజులు పాటు జరిగేఈశిబిరాలలో మండలంలోని ఆయా ప్రాంతాల్లోని 6500ల మూగజీవాల కాపరులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం ఎస్ ఏ దివాకర్ కోరారు. మొవ్వ గ్రామంలోని గొర్రెలకు మేకలకు మందు వేసిన ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు డాక్టర్ రేష్మా, సిబ్బంది అజయ్, శ్యామ్, శీను, ఆంజనేయులు, గొర్రెలు, మేకల సంఘం అధ్యక్షుడు చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలలో కాలువల నిర్మాణం అభినందనీయం



**నందిగామ, జూన్ 26, మేజర్ న్యూస్ :** దేశంలో ఎక్కడ నిర్మించని మ్యాజిక్ డ్రైన్ నుఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని నందిగామ మండలం సోమవరం రాష్ట్ర ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా ప్రతిపాదించటం తద్వారా మ్యాజిక్ డ్రైన్లు నిర్మాణం చేపట్టటం అభినందనీయమని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య పేర్కొన్నారు, ప్రభుత్వం మ్యాజిక్ డ్రైన్ నిర్మాణానికి ఎంపికైన సోమవరం గ్రామంలో జరుగుతున్న పనులను పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులు, పలు జిల్లాల పీడీలతో కలిసి ఎమ్మెల్యే రాజగోపాల్ పరిశీలించారు.. నిర్మాణాం పనులు ఎంత ఖర్చు అయ్యే వివరాలు అధికారులు ఎమ్మెల్యేకు తెలియజేశారు, ఈ సందర్భంగా శ్రీరామ్ రాజగోపాల్ మాట్లాడుతూ ఎక్కడ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం మ్యాజిక్.డైన్.పైలెట్ ప్రాజెక్టుగా సోమవరం ఎంపిక తెలిపారు, సిమెంట్ కాలువ నిర్మాణానికి లక్షల రూపాయల ఖర్చవుతుందని, మ్యాజిక్ డ్రైన్ మూడు దశల్లో 100 మీటర్ల కు 90 వేల నుండి లక్ష రూపాయల ఖర్చు అవ్వటంతో పాటు ప్రతి 50 మీటర్ల కాలవ మధ్యన ఇంకుడు గుంట తో నిర్మాణాం పనులు జరుగుతున్నాయని తెలిపారు, సిమెంట్ కాలవ ఖర్చు కన్నా చాలా తక్కువ ఖర్చు పాటు ప్రజలకు ఉపయోగ కరంగా మ్యాజిక్ డైన్ నిర్మాణం పనులు చేపడుతున్నట్టు తెలిపారు, ఈ మ్యాజిక్ డ్రైన్లు నిర్మాణం వలన మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు ఇంకిపోవడం మురికి నీటి సమస్యను తక్కువ ఖర్చుతో పరిష్కరించుకోవచ్చునని, క్రిమి కీటకాలు దోమల సమస్య ఉండదని, నీటి నిలవ ఉండకపోవటం వల్ల ఎటువంటి దుర్వాసన, వ్యాధుల సమస్య ఉండదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మ్యాజిక్ డ్రైన్లో నీరు ఇంకిపోవడం వలన భూగర్భ జలాలను సహజ సిద్ధంగా పెంపొందించుకోవచ్చునని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో జరుగుతున్న మ్యాజిక్ డ్రైన్ల పనులను 26 జిల్లాల పీడీలు పరిశీలించారు. గ్రామంలో 1000 మీటర్ల కాలవ నిర్మాణం పనులు చేపడుతున్నట్లు, ఈ పైలెట్ ప్రాజెక్టు విజయవంతం రాష్ట్రంలో అన్నిచోట్ల మ్యాజిక్ డ్రైవ్ నిర్మాణం పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన చేస్తుందని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్ జాయింట్ కమిషనర్ సునీత, చీఫ్ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్, ఎన్టీఆర్ జిల్లా డ్రామా పిడి. రాము, 26 జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో శరత్ బాబు గ్రామాల నాయకులు ఉప్పుకుండూరు గురు ప్రసాద్,మన్నే కళావతి, తోట నాగమల్లేశ్వరరావు, మల్నీడు ప్రసాద్,బెల్లం కోటేశ్వరరావు, జంగాల శ్రీనివాసరావు యోగానందం, పల్లె పోగు ప్రభుదాసు, గాదెల వెంకట రామారావు అబ్బూరు వెంకటేశ్వరరావు, అప్పారావు శేషగిరిరావు కృష్ణమోహన్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల వినియోగంతో ప్రజల జీవితాలు దుర్భరం




**పామర్రు జూన్ 26 మేజర్ న్యూస్:** మాదక ద్రవ్యాల వినియోగంతో ప్రజలు తమ జీవితాలను దుర్భరం చేసుకుంటున్నారని పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆవేదన వ్యక్తం చేశారు. తమ కూటమి ప్రభుత్వం అధికారం లోనికి వచ్చాక దీనిపై పర్యవేక్షణ చేస్తూ నియంత్రిస్తున్నామని పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో గురువారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్య క్రమంలో తహసిల్దార్ జి.రవికాంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్, మండల విద్యాశాఖ అధికారి పద్మ వాణి, ఐసిడిఎస్ ప్రాజె క్టు అధికారిణి వి.భానుశ్రీ, కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూ రుపల్లి గణేష్, జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జ్ తాడిశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వారితో మాదకద్రవ్యాలను వ్యతిరేకిస్తూ ఎమ్మెల్యే కుమార్ రాజా ప్రతిజ్ఞ చేయించారు. అంతకుముందుగా ఎన్టీఆర్ సర్కిల్ నుండి సమావేశం జరిగే ప్రాంతం వరకు పామర్రు లో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు తెలుగు దేశం, జనసేన పార్టీలకు చెందిన పలువురు నాయ కులు, కార్యకర్తలు అధికారులు, అంగన్ వాడి కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వివిధ పాఠశాలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల వినియోగం పై ర్యాలీ



**పమిడిముక్కల జూన్ 26 మేజర్ న్యూస్:** మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఐనపూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం గ్రామ వీధులలో ర్యాలీ నిర్వహించారు. మాటక ద్రవ్యాల వినియోగంపై గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును బుగ్గిపాలు చేసుకోకండి




**మొవ్వ జూన్ 26 మేజర్ న్యూస్:** మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్తును బుగ్గి చేసుకోవద్దని స్థానిక తహసిల్దార్ కే మస్తాన్ యువతకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన మొవ్వ శ్రీ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు, కూచిపూడి పోలీస్, మొవ్వ ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ ఎక్సైజ్ ప్రొహిబిషన్ సీఐ వరాల రాజు, కూచిపూడి ఎస్ ఐ కే ఎన్ విశ్వనాథ్, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాస్, పలువురు విద్యార్థిని విద్యార్థులు కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరం మొవ్వ సెంటర్లో మానవహారం నిర్వహించారు.

### మాదక ద్రవ్య రహిత సమాజం నిర్మించాలని ప్రతిజ్ఞ



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** నేటి యువత మారకద్రవ్యాలకు బానిసలు కాకుండా మాదకద్రవ్య రహిత సమాజానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని మండల పరిషత్ అధికారిణి మరియకుమారి అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య దినోత్సవం సందర్భంగా అవనిగడ్డలో నషా ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. తొలుత గంజాయి వద్దు బ్రో.. ఆరోగ్యమే ముద్దు అంటూ నినాదాలతో విద్యార్థినీ విద్యార్థులతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపిడివో మరియ కుమారి, తహసీల్దార్, సిఐ గాజుల యువకుమార్ లు గంజాయి, పొగాకు ఉత్పత్తులు వినియోగిస్తే కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. రేపటి తరం గంజాయి రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ కె.శ్రీనివాస్, అవనిగడ్డ ఎంపిపి తుంగల సుమతి, అవనిగడ్డ పంచాయతీ కార్యదర్శి తోట శ్రీనివాసరావు, అవనిగడ్డ హైస్కూల్, జూనియర్ కాలేజి ఉపాధ్యాయులు, విద్యార్థులు, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్ వద్దు బ్రో అనే నినాదంతో మార్మోగిన జగ్గయ్యపేట




**జగ్గయ్యపేట:జూన్ 26 మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ యాంటీ డ్రగ్స్ డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఎన్టీఆర్ జిల్లా పోలీసు శాఖ వారి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహించిన డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, డి.ఎస్.పి ఏజీబి తిలక్, రూరల్ డిసిపి కె ఎన్ మహేశ్వర రాజు, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు శ్రీరాం ధనుంజయ్ (చిన్నబాబు), పోలీసు అధికారులు పాల్గొని చిల్లకల్లు రోడ్డులో గల చత్రపతి శివాజీ విగ్రహం వద్ద నుండి ఎన్టీఆర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డి టీవీ కృష్ణారావు, సీఐ పి వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేట ఎస్ఐ జి. రాజు, వత్సవాయి ఎస్ఐ పి. ఉమామహేశ్వరరావు, పెనుగంచిప్రోలు ఎస్ఐ అర్జున్, చిల్లకల్లు ఎస్ఐ పి. సూర్య శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్స్ కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టే నాగరాజు, నకిరకంటి వెంకట్, ఇర్రి నరసింహారావు, పేరం సైదేశ్వర రావు, నాయకులు షేక్ ఖాసిం, షేక్ గౌస్ భాష, గడ్డం హుస్సేన్, మల్లెల కొండయ్య, కర్ల జోజి, యమర్తి బోస్ యాదవ్, దువ్వల రామకృష్ణ, మన్నె నారాయణ, రావూరి విశ్వనాథం, ముత్తినేని అశోక్, బొబ్బిళ్ళపాటి ప్రసాద్, ఎన్ సిసి, ఎన్ ఎస్ ఎస్, స్కూల్స్, కాలేజీల విద్యార్థినీ విద్యార్థులు, మున్సిపల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### బి డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోలీసువారి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



**నందిగామ జూన్ 26 మేజర్ న్యూస్ :** టెర్రరిజం తర్వాత అంతర్జాతీయంగా అత్యంత ప్రభావితమైనది డ్రగ్ మాఫియా అని డీసీపీ మహేశ్వరరాజు అన్నారు. గురువారం అంతర్జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నందిగామ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఏ పి జి తిలక్ ఆధ్వర్యంలో స్థానిక పోలీసు వారు డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ తిలక్ మాట్లాడుతూ గత సంవత్సరం ఎన్డీఏ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జూన్ 26వ తేదీన డ్రగ్స్ వద్దు బ్రో పేరిట మత్తు పదార్థాలకు వ్యతిరేక దినోత్సవాన్ని చేపట్టారని తెలిపారు. ఆర్డీవో కే బాలకృష్ణ మాట్లాడుతూ మత్తు పదార్థాల సేకరణ అరికట్టడంతో ప్రతి ఒక్కరూ భాగస్వాములై భావితరాలకు స్వచ్ఛమైన సమాజాన్ని అందిద్దామని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కూడా అప్రమత్తతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పట్టణ మండల అధ్యక్ష కార్యదర్శులు ఏచూరు రాము వీరంకి వీరస్వామిన్,పట్టణ కార్యదర్శి కాసర్ల లక్ష్మీనారాయణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై వి ఎల్ నాయుడు, అధికారులు, ప్రజాప్రతినిధులు,పెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనే యువత ధ్యేయం కావాలి




**గుడ్లవల్లేరు జూన్ 26 మేజర్ న్యూస్ :** "అంతర్జాతీయ మాదకద్రవ్య రహిత దినోత్సవం" సందర్భంగా గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ ఎన్ఎస్ఎస్ యూనిట్, ఎపి ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో మాదకద్రవ్య నిర్మూలనపై విద్యార్థుల ర్యాలీ, ప్రత్యేక అవగాహన కార్యక్రమం గురువారం గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులు గా గుడ్లవల్లేరు మండల రెవెన్యూ అధికార బి. లోకరాజు, గుడివాడ రూరల సిఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరావు, గుడ్లవల్లేరు ఎస్ఐ ఎన్.వి.వి. సత్యనారాయణ హాజరై గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్.ఆర్.పాలిటెక్నిక్ విద్యార్థులచే ప్లకార్డ్స్ నినాదాల నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సు ముఖ్య అతిథి ఎంఆర్ఓ లోకరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు ఆరోగ్యానికి, కుటుంబానికి, సమాజానికి ప్రమాదకరమైన పదార్థాలని, ఇవి తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తాయని, మానసిక అస్థిరత, శారీరక సమస్యలు, కుటుంబ విభేదాలు, ఉద్యోగ అవకాశాల కోల్పోవడం వంటి అనేక భయంకరమైన దుష్పరిణామాలకు కారణమని, ప్రత్యేకంగా మన యువత ఈ మాదకద్రవ్యాల ప్రభావానికి లోనుకాకుండా ఉండాలని హితవు పలికారు. గుడివాడ రూరల్ సి.ఐ సోమేశ్వరరావు మాట్లాడుతూ మీ భవిష్యత్తు బంగారమయం కావాలంటే డ్రగ్స్ లాంటి ప్రమాదకరమైన అలవాట్లకు దూరంగా ఉండండి. మంచి స్నేహితులు, మంచి ఆలోచనలు,, ఆరోగ్యకరమైన జీవనశైలి దిశగా అడుగులు వేయండి," అని సూచించారు. ఇది కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదు – ఇది సమాజం మొత్తం మీద ప్రభావం చూపుతోంది. డ్రగ్స్ వాడకం వలన నేరాలు పెరుగుతున్నాయి, కుటుంబాలు విరిగిపోతున్నాయి, మన దేశ భవిష్యత్తైన యువత విక్షిప్తమవుతోంది అని సూచించారు. ఎస్ఐ ఎన్ వి వి. సత్యనారాయణ మాట్లాడుతూ "డ్రగ్స్ యువతను మానసిక, శారీరక రోగాలకు లోనయ్యేలా చేస్తాయని, అందుకే మనమందరం కలిసికట్టుగా డ్రగ్స్వినియోగాన్ని అడ్డుకోవాలి," ఇలాంటి పరిస్థితిని అరికట్టాలంటే, మనందరం శక్తివంచన లేకుండా కృషి చేయాలి. విద్యార్థులు మీరే భవిష్యత్తు. మీరు మీ జీవితాన్ని మంచి మార్గంలో నడిపించాలి. ఎటువంటి మాదకద్రవ్యాల వాడకానికీ లొంగకండి. మంచి స్నేహితులు ఎంచుకోండి, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించుకోండి, మీ లక్ష్యాన్ని మర్చిపోకుండా ముందుకు సాగండి అని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్, ఎన్.ఎస్.ఎస్ కోర్డినేటర్ పి.రామకృష్ణ, వివిధ విభాగాల విభాగాధిపతులు, అధ్యాపకులు, గ్రామస్థులు, పోలీస్ శాఖ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. డ్రగ్స్ పై అవగాహన కల్పించే పోస్టర్లు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు మాదకద్రవ్యాల ప్రమాదాలపై ప్రసంగాలతో చైతన్యం కలిగించారు.

## వయోవృద్ధుల ఆశీస్సులే ఎమ్మెల్యే కాగితకు దీవెనలు



**పెడన, మేజర్ న్యూస్:** నిరాడంబరుడు విద్యావంతుడు నియోజకవర్గం శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్‌కు వయోవృద్ధుల ఆశీస్సులే దీవెనలుగా ఉండాలని పట్టణంలో గల అమ్మ ఫుడ్ ఫౌండేషన్ లోనే వృద్ధులకు సుమారు 100 మందికి అన్నదాన కార్యక్రమం చేపట్టామని గూడూరు మండలం ఆకుమర్రు గ్రామ టిడిపి అధ్యక్షుడు బొల్ల రాజేష్ అన్నారు. ఈ మేరకు పట్టణంలో గల అమ్మ ఫుడ్ ఫౌండేషన్‌లో దివ్యాంగులైన చౌడేశ్వరి మల్లికార్జున దంపతులు నిర్వహిస్తున్న ఫౌండేషన్‌లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా రాజేష్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ నిరాడంబరుడు విద్యావంతుడు చిరునవ్వుల కాగితకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వెలుగుతూ ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటూ ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి గోపి నాగబాబు, జనసేన నాయకులు వన్నెం రెడ్డి సాయి కిరణ్, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం - ఇంటర్నేషనల్ యాంటీ డ్రగ్స్ డే




**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్ వద్ద ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాంటీ డ్రగ్స్ అండ్ ఎలిసెట్ ట్రాఫికింగ్ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మి షా ఆదేశాల మేరకు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి విఎంసి సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా అకౌంట్స్ ఆఫీసర్ బి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, యువత భవిష్యత్‌ను కాపాడాలంటే ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడాలని, ఇటువంటి కార్యక్రమాల ద్వారా అవగాహన పెరగాలని తెలిపారు. డ్రగ్స్ ప్రభావం నుంచి సమాజాన్ని రక్షించేందుకు ప్రతి పౌరుడు బాధ్యతగా వ్యవహరించాలని, ఇటువంటి కార్యక్రమాలు స్థిరంగా నిర్వహించడం ద్వారా సమాజంలో చైతన్యం పెరిగి, డ్రగ్స్ వాడకంపై నియంత్రణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంటింగ్ ఇంజనీర్ ప్రాజెక్ట్స్ పి. సత్యకుమారి, విఎంసి వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

## డిజి లక్ష్మీలకు సాంకేతికత పై ఆన్లైన్లో శిక్షణ



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్ -3 పరిధిలో డిజి లక్ష్మి క్రింద నమోదైన సభ్యులకు గురువారం నాడు పటమట సర్కిల్ -3 ఆఫీస్‌లో మెప్మా ఆద్వర్యం లో డిజి లక్ష్మి నిర్వహణపై ఆన్లైన్ ట్రైనింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) పి. వెంకటనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం లో వారి విధి విధానాలు, ప్రజలకు డి జి లక్ష్మి పై అవగాహన ఎలా కల్పించాలి, ఏవిధముగా డిజి లక్ష్మి కార్యక్రమాలు నిర్వహించాలని వంటి అంశాలపై ఆన్లైన్లో సభ్యులకు శిక్షణ నిర్వహించారని తెలిపారు. స్వయం సహాయక బృందాల సభ్యులకు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇదొక మంచి అవకాశం అని, దీని ద్వారా వాళ్ళకి సాంకేతికత పై అవగాహన పెరగడమే కాకుండా ఆర్థిక అభివృద్ధి కూడా జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయవాడ నగర పాలక సంస్థ, యు.సి.డి.విభాగం, సీడీఓ,టీఈలు, సీఒ,యస్డబ్ల్యూ, సీఎల్ఆర్పీలు హాజరయ్యారు.

# వైసీపీ రెడ్డిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పైడిమర్ల శ్రీనివాసరెడ్డి

**రెడ్డిగూడెం, జూన్ 26, మేజర్ న్యూస్ :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి జోగి రమేష్ ఆదేశాల మేరకు గ్రామాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు కార్యాచరణ ప్రారంభించారు. దానిలో బాగంగా గురువారం సాయంత్రం రెడ్డిగూడెం లో పైడమర్ల నర్సారెడ్డి ఇంటిదగ్గర నూతనంగా గ్రామ కమిటీ ఎన్నిక మండల అధ్యక్షుడు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.రెడ్డిగూడెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా పైడిమర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు మాతంగి కుమారస్వామి, సెక్రటరీ బత్తుల వీరబాబు, జనరల్ సెక్రటరీ శనగల గోపిరెడ్డి, కోశాధికారి గేదె కొండారెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎన్టీఆర్ జిల్లా కార్య నిర్వహణ కార్యదర్శి చాట్ల రాబర్ట్, రెడ్డిగూడెం ఎంపీటీసీ జిల్లా నాయకులు కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, గుడిసె జమలా రెడ్డి, మైలవరం నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు ఉయ్యూరు సత్యనారాయణ రెడ్డి, రెడ్డిగూడెం



మండల మహిళా అధ్యక్షురాలు చింతరాల లూర్ధు మాత, రెడ్డిగూడెం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు గుడిసె ప్రభాకర్ రెడ్డి, రెడ్డిగూడెం మండల యువజన నాయకులు గుంటక వంశీకృష్ణారెడ్డి, రంగాపురం గ్రామ కమిటీ అధ్యక్షులు బొల్లారెడ్డి చెన్నా రెడ్డి, యూత్ నాయకులు గుంటక కులదీప్ రెడ్డి, వార్డు మెంబర్లు వాలంటీర్లు కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ మాదక ద్రవ్యాల నిషేధిత అవగాహనా ర్యాలీ



**నాగయలంక జూన్ 26 మేజర్ న్యూస్:** నాగాయలంక గ్రామములోని షిరిడి సాయిబాబా గుడి వద్ద నుండి నాగాయలంక సబ్ ఇన్స్పెక్టర్ పోలీస్ కలిదిండి రాజేష్ మండల రెవెన్యూ అధికారి సిహెచ్.వీరాంజనేయ ప్రసాద్, వెలుగు ఏపీఓ కే వై. దాసుగారు డ్వాక్రా మహిళలు నాగాయలంక జిల్లా పరిషత్ హై స్కూల్, స్కాలర్స్ కాన్వెంట్ విద్యా భారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపకులు పోలీస్ స్టేషన్ రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ర్యాలీగా బయలుదేరి మాదక ద్రవ్యాలు వాడితే కలుగు అనార్థాల పైన నినాదాలు చేస్తూ మెయిన్ సెంటర్ వద్దకు వచ్చి విద్యార్థినీ విద్యార్థులు, అధికారులందరూ కలిసి సమిష్టిగామానవహారముగా ఏర్పడి మాదకద్రవ్యాలు వాడితే కలుగు అనర్థాల పైన భవిష్యత్తులో జరుగు ప్రమాదాల పైన వారి జీవితంలో జరుగు నష్టాల పైన వివరించి సమిష్టిగా అందరు కలిసి ప్రమాణము చేసి ఉన్నారు.

### మాదిగ ద్రవ్యాలతో జీవితమే శూన్యం : ఎస్సై ప్రతాపరెడ్డి




**ఘంటసాల, మేజర్ న్యూస్:** డ్రగ్స్ వద్దు – జీవితమే ముద్దు అంటూ అధికారులు, విద్యార్థుల నినాదాలతో నిర్వహించిన ర్యాలీ ఘంటసాలలో ఆకట్టుకుంది. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం కార్యక్రమం ఘంటసాల ఎస్సై. కే.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పానీయాలు, డ్రగ్స్ కు దూరంగా ఉండాలన్నారు.ఎంఈఓ ఎండి మోమిన్ మాట్లాడుతూ దుర్వసనాలకు అలవాటుపడి విద్యను అలక్ష్యం చేసి ఇబ్బందులకు గురి కావద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని విద్యార్థులకు, ప్రజలకు ఎస్సై ప్రతాప్ రెడ్డి సూచించారు. అనంతరం ఘంటసాల పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన సెంటర్ వరకు డ్రగ్స్ వద్దు – జీవితం ముద్దు అంటూ విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ వేమూరి ప్రమోద్ కుమార్, ఎంపీడీఓ కార్యాలయం అధికారులు, వివద శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనకు పాటుపడదాం

**గుడ్లవల్లేరు మేజర్ న్యూస్ :** మాదకద్రవ్య రహిత దినోత్సవం సం దర్భంగా ఐసిడిఎస్ గుడివాడ ప్రాజెక్టు, గుడ్లవల్లేరు సెక్టార్ ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు – 3 అంగన్వాడీ కేంద్ర పరిధిలోని ఎఎన్ఎమ్, వివిఆర్ఎస్ఆర్ హైస్కూలులో మాదకద్రవ్యాల నిర్మూలనపై 8,9 తరగతుల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. హైస్కూలు ప్రిన్సిపాల్ విపి కుంజు మన్ అధ్యక్షతన జరిగిన సదస్సులో అంగన్వాడీ సూపర్వైజర్ ఈ.వాణి తొలుత మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాదకద్రవ్యాల వాడకం వలన వచ్చే దుష్పరిణామలు, మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థుల పాత్రపై విపులంగా సూ పర్వైజర్ వాణి వివరి స్తూ విద్యార్థులకు అవగాహన కలుగ చేసారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.







## రమ్య లేని లోటు టీడీపీకి తీర్చలేనిది

**గన్నవరం, జూన్ 26, మేజర్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీలో చురుకుగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే మండవ రమ్య లేని లోటు అటు పార్టీకి, ఇటు మహిళా లోకానికి తీరనిలోటు అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సోదరుడు సతీష్ అభిప్రాయపడ్డారు. రమ్య ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం ఉదయం గన్నవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రమ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ గన్నవరంలో టిడిపి కార్యాలయంపై రౌడీ మూకలు దాడి చేసినప్పుడు సహచర మహిళా నాయకులతో కలిసి రమ్య రౌడీలను ఎదిరించి పోరాడారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలోనూ వెంకట్రావు గెలుపు కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గూడవల్లి నరసయ్య, ఆళ్ల గోపాలకృష్ణ, రవి వర్మ ( జనసేన ), పొదిలి లలిత, సుమతి, బోడపాటి రవి, కంచర్ల సూర్య, సొంగ సతీష్, తులిమిల్లి ఝాన్సీ, మేడేపల్లి రమ, కంభంపాటి లక్ష్మి, నెక్కంటి శ్రీదేవి, శివ లీల, పడమట రంగారావు రమ్య చిత్రపటానికి నివాళులర్పించారు.

## మృతుల కుటుంబాలకు సత్వరం పరిహారం అందేలా చర్యలు చేపట్టాలి : లకనం

**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** ఇటీవల మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు వెంటనే పరిహారం పనిచేయాలని టీడీపి నేత ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవా సమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో అధికారులను కోరారు. సముద్రంలో చేపల వేటకు వెళ్ళి ఈ నెల 16వ తేదీన కోనసీమజిల్లా అంతర్వేది వద్ద ప్రమాద వశాత్తు బోటు నుంచి సముద్రంలోకి జారిపడి మృతి చెందిన నాగాయలంక మండలానికి చెందిన నాగిడి రాము, తమ్ము పోతురాజుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారం సకాలంలో అందించే లా చర్యలు చేపట్టాలని మత్స్యశాఖ అధికారులను కోరారు. పరిహారం పొందేందుకు అవసరమైన అన్ని పత్రాలు స్వీకరించేందుకు మృతుల కుటుంబాలకు మత్స్య శాఖ అధికారులు సహకరించాలన్నారు. ఈ లాంటి విపత్కర పరిస్థితిలో ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. నిబంధనలతో నిమిత్తం లేకుండా మృతుల భార్యలకు ప్రత్యేకంగా వితంతు పిన్షన్ మంజూరు చేయాలని లకనం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## శ్రీనివాస్ మృతదేహానికి ఘన నివాళులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పోలీసుల వేధింపుల కారణంగా పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన టిడిపి వీరాభిమాని బొర్రా నాగ శ్రీనివాస్(26) మృతదేహానికి వైసీపీ అభిమాని బడే గౌతమ్ గురువారం నివాళులర్పించారు. మండల పరిధిలోని పులిగడ్డ గ్రామంలో వారం రోజులు క్రితం జరిగిన కొట్లాట విషయమై నాగ శ్రీనివాస్, అతని తండ్రి రాంబాబు పై అధికార పార్టీకి చెందినవారు ఫిర్యాదు చేయగా స్థానిక పోలీసులు వారిని పలుమార్లు పోలీస్ స్టేషన్ కు పిలిచి మందలించడంతో పాటు రౌడీషీట్ తెరుస్తాము అని బెదిరించడంతో మనస్థాపానికి గురైన నాగ శ్రీనివాస్ మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయగా బుధవారం చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహానికి యువనేత గౌతమ్ గురువారం పూలమాల వేసి ఘన నివాళులు అర్పించి, కుటంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెల్షిరు. నాగ శ్రీనివాస్ కు 6 నెలల చిన్న పాప అమ్మ, నాన్న, భార్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ బార్ వైస్ ప్రెసిడెంట్ చెన్ను నాగ మల్లేశ్వరావు, మాజీ నీటి సంఘ అధ్యక్షులు వర్రే బసవరావు, అద్దంకి శేషు, బొర్రా బాల కృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సాయి దత్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే



**పమిడిముక్కల జూన్ 26 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని కపిలేశ్వరపురం గ్రామంలో గురువారం జరిగిన తెలుగు దేశం పార్టీ నాయకులు తాతినేని సాయిదత్ తండ్రి పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, నాయకులు జక్కా శ్రీనివాసరావు, కొల్లిపర బాబి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కూటమి ప్రభుత్వంతోనే మేలు

### యువనాయకులు మండలి వెంకట్రామ్

### గుండేరు పనులు ప్రారంభించిన పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు

### పూజలు చేసిన వెంకట్రామ్, డీసీ చైర్మన్ భానుప్రకాష్



**ఘంటసాల, మేజర్ న్యూస్: కూటమి** ప్రభుత్వంతో రైతులకు మేల అని యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం ఘంటసాల మండలం, ఘంటసాలపాలెంలో ఎస్.డీ.ఎం.ఎఫ్ నిధులు రూ.39.10 లక్షలతో గుండేరు మేజర్ డ్రైనేజీ పూడికతీత, జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. ఘంటసాలపాలెం నుంచి కొడాలి ఎస్సీ కాలనీ వరకూ 3.9 కిలోమీటర్లు పొడవున చేసే ఈ పనులను తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు పూజ చేసి ప్రారంభించారు. మండలి వెంకట్రామ్, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, కృష్ణా మిల్క్ యూనియన్ డైరెక్టర్ వేమూరి సాయి వెంకటరమణ వాహన పూజ చేశారు. వెంకట్రామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సహకారంతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కృషితో జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ఆపరేషన్స్ అండ్ మైంటెనెన్సు నిధులతో ఇరిగేషన్, డ్రైనేజీ శాఖల పరిధిలోని అన్ని పంట కాలువలు, డ్రైనేజీలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నిధులతో ప్రధానమైన గుండేరు, రత్నకోడు, లింగన్న కోడు మేజర్ డ్రైనేజీలు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబూ నాయక్, ఏఈఈ చిరంజీవి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కోన రాజశేఖర్, కూటమి నాయకులు గుత్తికొండ వరప్రసాద్, బండి పరాత్పరరావు, దాసరి సతీష్, వేమూరి రమేష్, కొండవీటి శ్రీనివాసరావు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కైలే జ్ఞానమణి నియామకం



**పామర్రు జూన్ 26 మేజర్ న్యూస్ :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పామర్రు నియోజకవర్గ మాజీ శాస నసభ్యులు కైలే అనిల్ కుమార్ మాతృమూర్తి కైలే జ్ఞానమణి ఆ పార్టీ రాష్ట్ర మహిళా విభా గం ప్రధాన కార్యదర్శిగా నియామకం అయ్యారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగిందని ఉత్తర్వులు వెలువడ్డాయి. గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండల జడ్పిటిసి సభ్యురాలిగా ఉన్న జ్ఞానమణిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తుండటం వల్లే అనిల్ కుమార్ కు రాష్ట్ర అధికార ప్రతినిధిగా, ఆయన మాతృమూర్తి జ్ఞానమణికి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవులు లభించడం నిదర్శనమని పలువురు పేర్కొంటున్నారు. తమపై నమ్మకంతో ఈ అవకాశాన్ని కల్పించిన పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన అందించిన అవకాశంతో మహిళా విభాగం పటిష్టతకు కృషి చేస్తానని ఈ సందర్భంగా జ్ఞానమణి పేర్కొన్నారు.

## చదువును విద్యార్థులు వజ్రాయుధంగా తీసుకోవాలి

### కేసరపల్లి ఉపసర్పంచ్ జాస్తి శ్రీదర్ బాబు



**గన్నవరం, జూన్ 26, మేజర్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతంలో అక్షరాస్యత శాతాన్ని పెంచడంలో దాతలసాయం కీలకంగా మారిందని కేసర పల్లి ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్ బాబు( చిన్ని) అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో రాష్ట్రస్థాయి ఎనిమిదో ర్యాంకు సాధించిన గన్నవరం నియోజకవర్గానికి చెందిన తోట కుసుమ ప్రియకు కేసరపల్లి పెట్రోల్ బంక్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో కుసుమ ప్రియను సత్కరించి తన వంతు సహాయంగా ఉన్నత చదువులు చదువుకోవటానికి శ్రీధర్ బాబు( చిన్ని) పదివేల రూపాయల ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువును పేద విద్యార్థులు వజ్రాయుధంగా తీసుకోవాలని చదువు ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించి తమ జీవితాల్లో వెలుగులు నింపుకోవాలని సూచించారు నిరక్షరాస్యత రూపు మాపటానికి ప్రభుత్వం అధికార యంత్రాంగం విశేషంగా కృషి చేస్తుందని కొనియాడారు. దాతలు తమ సహకారాన్ని ఇంకా ఎక్కువగా అందించాలని కోరారు కేసరపల్లి గ్రామంలో తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని కుసుమ ప్రియ జీవితంలో మంచి ఉన్నత శిఖరాలు సాధించాలని సాధించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు శొంఠి కిషోర్ బాబు, ప్రముఖ న్యాయవాది శొంఠి వీరబాబు, చిన్ని యువసేన నాయకులు బోయపాటి తారక రామారావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విస్తృత ఈ కామర్స్ సేవల కోసం ఫ్లిప్‌కార్ట్ నూతన విధానాలకు ప్రణాళిక

**విజయవాడ, మేజర్ న్యూస్ :** భారతదేశపు స్వదేశీ ఇ కామర్స్ మార్కెట్‌ప్లేస్ అయిన ఫ్లిప్‌కార్ట్ విక్రేతలు, కస్టమర్‌ల కోసం వృద్ధి ఆధారిత వేదికను పెంపొందించడం కొనసాగిస్తోందని ఫ్లిప్‌కార్ట్ మార్కెట్ ప్లేస్ విభాగ సీనియర్ డైరెక్టర్ కపిల్ తీరాని తెలిపారు. నూతన విధానాలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ సౌకర్యవంతమైన రీతిలో ఆన్‌బోర్డింగ్ మద్దతు, మెరుగైన ఉత్పత్తి ఆవిష్కరణ, సరళీకృత ధరల ప్రక్రియల నుండి, ఈ కార్యక్రమాలు ఆన్‌లైన్ వ్యాపారాన్ని మరింత అనుకూలమైన, పారదర్శక, బహుమతిగా చేయడానికి రూపొందించబడ్డాయన్నారు. ముఖ్యంగా మొదటిసారి విక్రేతలకు న్యూ సెల్లర్ సక్సెస్ ప్రోగ్రామ్ ప్రారంభ విక్రేత విజయాన్ని నిర్ధారించడానికి సరళీకృత సాధనాలను అందిస్తుందన్నారు. ఇ కామర్స్‌కు అవకాశాలను విస్తరించడానికి భారతదేశవ్యాప్తంగా విక్రేతలకు మరింత సమానమైన వృద్ధిని అందించాలనే ఫ్లిప్‌కార్ట్ లక్ష్యం బలోపేతం చేస్తుందని చెప్పారు. ప్రతి సంవత్సరం కొత్త విక్రేతల విజయం పెరుగుతుండటం, భారతదేశం అంతటా వ్యాపారాలు, కస్టమర్ల కోసం ఈ ప్రయత్నాల ప్రభావాన్ని ఇది మరింతగా ప్రతిబింబిస్తుందన్నారు. జనవరి 2025 నుండి, మొదటిసారిగా విక్రేతలుగా మారిన అమ్మకందారులకు ఉచిత ఆన్‌బోర్డింగ్ మద్దతును ఫ్లిప్‌కార్ట్ అందిస్తోందని, వారు కార్యకలాపాలను ప్రారంభించిన మొదటి 60 రోజుల్లో ప్లాట్‌ఫామ్ యొక్క పర్యావరణ వ్యవస్థ ద్వారా వారికి మార్గనిర్దేశం చేస్తోందన్నారు. మొదటిసారి వ్యవస్థాపకుల కోసం రూపొందించబడిన ఈ కార్యక్రమం లిస్టింగ్, కేటలాగింగ్ నుండి ఆర్డర్ ఫుల్ ఫిల్మెంట్ వరకు ఆన్‌బోర్డింగ్‌ను సులభతరం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమం ఫ్లిప్‌కార్ట్‌లో ఆన్‌బోర్డింగ్ చేసిన మొదటి 60 రోజుల్లోనే వ్యాపార విజయాన్ని సాధించే కొత్త విక్రేతల సంఖ్యలో 2.3 రెట్లు పెరుగుదలకు దారితీసిందని, ఈ మార్పులు భారతదేశం అంతటా, ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 నగరాల నుండి విక్రేతలకు ప్రారంభ ఊపును పెంచుతున్నాయని అన్నారు.

## మహిళలు స్వయం ఉపాధితోనే సమృద్ధి

### యువనాయకులు మండలి వెంకట్రామ్



**ఘంటసాల, మేజర్ న్యూస్:** మహిళలు స్వయం ఉపాధితోనే ఆర్థిక సమృద్ధి అని యువనాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. గురువారం ఘంటసాల మండలం చిట్టూర్పులో టీడీపీ నాయకులు గుత్తికొండ వరప్రసాద్ – గ్రామ ఉప సర్పంచ్ గుత్తికొండ రాజ్యలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పుట్ట గొడుగుల ఉత్పత్తి శిక్షణ శిబిరాన్ని వెంకట్రామ్ సందర్శించారు. వెంకట్రామ్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల మహిళలకు పట్టాభి మెమోరియల్ గ్రామీణ అభివృద్ధి సంస్థ, యూనియన్ బ్యాంకు సంయుక్త సహకారంతో గుత్తికొండ వరప్రసాద్ – రాజ్యలక్ష్మి దంపతులు క్రమం తప్పకుండా జీవన ఉపాధి శిక్షణ శిబిరాలు నిర్వహించటం శుభ పరిణామం అన్నారు. మహిళలు ఇలాంటి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకుని జీవన ప్రమాణాలు పెంచుకోవాలని కోరారు. పీసీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భానుప్రకాష్, జనసేన మండల అధ్యక్షులు కోన రాజశేఖర్, సీనియర్ నాయకులు బండి పరాత్పరరావు, కొండవీటి శ్రీనివాసరావు, శిక్షణ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కట్లేరు బ్రిడ్జ్ సమస్యకి రెండు నెలల్లో శాశ్వత పరిష్కారం



**తిరువూరు జూన్ 26, మేజర్ న్యూస్ :** గత ప్రభుత్వం అభివృద్ధి విషయంలో రాష్ట్రాన్నే కాదు తిరువూరు నియోజకవర్గాన్ని కూడా నిర్లక్ష్యం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మరో రెండు నెలల్లో తిరువూరు లో నెలకొన్న సమస్యలతో పాటు, కట్లేరు బ్రిడ్జ్ కి శాశ్వత పరిష్కారం లభించనుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. తిరువూరు మను గార్డెన్స్ లో గురువారం తిరువూరు వ్యవసాయ యార్డ్ ఛైర్ పర్సన్ రేగళ్ల లక్ష్మీ అనిత పదవి బాధ్యత ప్రమాణస్వీకార మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ కేశినేని శివనాథ్ హాజరయ్యారు. ఈ ప్రమాణ స్వీకార మహోత్సవ సభకు టిడిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అధ్యక్షత వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, టిటిపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ సమక్షంలో తిరువూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్ పర్సన్ గా రేగళ్ల లక్ష్మీ అనిత ప్రమాణా స్వీకారం చేసింది. ఆమె తో పాటు పాలక వర్గ సభ్యులు కూడా ప్రమాణ స్వీకారం చేవారు. అనంతరం ఎ.ఎమ్.సి ఛైర్ పర్సన్ రేగళ్ల లక్ష్మీ అనిత కు పుష్పగుచ్ఛం అందించి ఎంపీ కేశినేని శివనాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నిన్న తిరువూరు నగర పంచాయతీ ను గెలుచుకున్నాము.. ఇప్పుడు తిరువూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ను ఛైర్ పర్సన్ పొందాము...జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరువూరు లో ప్రతి గ్రామం, అర్బన్ ప్రాంతంలోని 20 వార్డ్ లు సొంతం చేసుకోబోతున్నామన్నారు. అలాగే కోర్ట్ సమస్యల వల్ల చింతలపూడి ఎత్తిపోతల పథకం ఆలస్యం జరిగింది, కోర్టు సమస్య పరిష్కారం జరగ్గానే ఆ పనులు తక్షణం ప్రారంభమవుతాయన్నారు. యువత ఉద్యోగాలు, ఉపాధి ఇతర ప్రాంతాలకు వెళ్ల కుండా తిరువూరు లో పరిశ్రమలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 2014 నుంచి 19 వరకు చాలా బలంగా వున్న వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీలు గత ప్రభత్వం వాటిని నిస్తేజం చేసిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో వ్యవసాయ యార్డ్ కమిటీలకు పూర్వవైభవం వచ్చేలా కృషి చేయనున్నారని తెలిపారు. నాలుగైదు నెల్లలో తిరువూరు నియోజకవర్గంలో పర్యటించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రానున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే మంత్రి నారా లోకేష్ నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. తిరువూరు లో నాలుగుసార్లుగా టిడిపి ఎమ్మెల్యే లేకపోయినా పార్టీ ఇంత బలోపేతంగా వుండటానికి కారణం టిడిపి నాయకులు కార్యకర్తలే అన్నారు. కొంతమంది టిడిపిను వీడటం వల్ల తిరువూరు లో టిడిపికి పునర్వైభవం వచ్చిందన్నారు. ఈ గెలుపు లో బిజెపి, జనసేన నాయకులు,కార్యకర్తల విశేష కృషి వుందని కొనియాడారు. ఎప్పటికీ వారి రుణం తీర్చుకోలేమంటూ వారికి అండగా వుంటామన్నారు. తెలుగు దేశం పార్టీకి కార్యకర్తల సంక్షేమమే ముఖ్యం..వారి సంక్షేమం కోసం పార్టీ పనిచేస్తుందన్నారు. ఎన్డీయే కూటమి నాయకులు కార్యకర్తలు పదవులు రాలేదని నిరాశపడొద్దని....కులమతాలకు అతీతంగా వుండే కూటమి సామాజిక న్యాయం తో పాటు యువకులతో పాటు అందరికీ అవకాశం కల్పిస్తుందన్నారు. ఎమ్మెల్యే జగన్ రౌడీలు గంజాయి బ్యాచ్ వెంట వేసుకుని రాష్ట్రంలో ఆరాచకాలు సృష్టించాలని చూస్తున్నారు. ఇటీవల వైసిపి ఎమ్మెల్యే జగన్ కారు కింద ఒక ముసలాయన పడితే తొక్కించుకుంటూ వెళ్లిపోయారే తప్ప..ఆ పార్టీ వాళ్లు హాస్పటల్ కి తీసుకువెళ్లలేదన్నారు.

దీంతో ఆ వ్యక్తి దాదాపు 45 నిమిషాలు ప్రాణాలతో పోరాడి చనిపోయాడన్నారు. క్రమశిక్షణకు మారుపేరు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు. ఆపదలో ఎవరైన కనిపిస్తే క్రమశిక్షణ గల ఎన్డీయే కూటమి కార్యకర్తలు ముందుగా హాస్పటల్ తరలిస్తారన్నారు. తల్లి, చెల్లి, జనాలను పట్టించుకోని ఎమ్మెల్యే జగన్ ను ప్రజా జీవితం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ ఆర్గానిక్ ప్రోడక్ట్ సర్టిఫికేషన్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్, ఎన్టీఆర్ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు చెరుకూరిరాజేశ్వరరావు, తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి కొఠారి సత్యనారాయణ ప్రసాద్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా జనరల్ సెక్రటరీ వాసం మునియ్య,తిరువూరు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ కొలికపోగు నిర్మల గంపల గూడెం మండల పార్టీ అధ్యక్షుడు రేగళ్ల వీరారెడ్డి, ఎ.కొండూరు మండలపార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి, విసన్నపేట మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వేణుగోపాల్, తిరువూరు వెదరు వెంకట నరిసిరెడ్డి, తిరువూరు టౌన్ బొమ్మసాని ఉమా మహేష్, టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, టిడిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.ఎమ్.ఫైజాన్, గంపల గూడెం మండల తెలుగు యువత అధ్యక్షుడు ఎమ్.ఆర్.కె., ఎన్టీఆర్ జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి మాదల హరిచరణ్ ( కిట్టు), వల్లభనేని గిరి, బిజెపి నాయకులు రామచంద్రరావు, శాంతి లతోపాటు జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 28న నగరంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఈనెల 28 వ తేదీన నగరంలోని జెడ్పి కన్వెన్షన్ హాలులో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించే నూతన పోకడల న్యాయ సేవల శిబిరాన్ని అందరూ కలిసికట్టుగా విజయవంతం చేయాలని ఆ సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి కెవి రామకృష్ణయ్య జిల్లా అధికారులకు సూచించారు. గురువారం నగరంలోని న్యాయస్థానాల సముదాయంలో గల న్యాయ సేవా సదన్ లో సీనియర్ సివిల్ జడ్జ్ నూతన పోకడల న్యాయ సేవలు శిబిరం ఏర్పాట్లపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 28 వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో నూతన పోకడల న్యాయ సేవల శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి తో సహా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ పాల్గొంటారన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో న్యాయశాఖకు సంబంధించి రెండు పథకాలను విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. అందులో బాల బాలికలకు సంబంధించి అందించే న్యాయ సేవలు, గంజాయి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అందించే న్యాయ సేవలు పైన వివరించడం జరుగుతుందన్నారు. సమాజంలో రెండు ప్రధాన సమస్యలు ఉన్నాయని అందులో మొదటిది గంజాయి వాడకం కాగా రెండవది మానవ అక్రమ రవాణా అన్నారు. బాల్య వివాహాలు గానీ లేదా ఏ ఇతర ఏ సమస్య తీసుకున్న నేరాలు చేస్తున్న వారిని అడిగితే అందుకు మూల కారణం పేదరికం అంటున్నారన్నారు. అయితే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం ఉపాధి హామీ పథకం, తల్లికి వందనం వంటి అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. ఆ ప్రకారంగా లబ్ధి పొందుతున్న ఇంకా పేదరికం ఉందంటే అర్హులైన లబ్ధిదారులు పథకాలు పొందుతున్నారా లేదా తెలియక పొందలేకపోతున్నారా లేదా అసలు పథకాలు వారికి అందడం లేదా అనే ప్రశ్న తలెత్తుతూ ఉందన్నారు. ప్రభుత్వాలు తమవంతుగా ఏమేమి కార్యక్రమాలు పథకాలు అమలు చేస్తున్నాయో ప్రజలలోకి తీసుకెళ్లి సమస్యల పట్ల అవగాహన కలిగించాలన్నారు. అప్పుడే అర్హులైన వారు లబ్ధి పొంది ఆ సమస్య నుండి బయట పడతారన్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ అభివృద్ధి పథకాలను న్యాయవ్యవస్థ ద్వారా ప్రజలకు తెలియజేస్తే వారిలో నమ్మకం కుదిరి వాటిని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉందని భావించి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇటువంటి ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇటువంటి శిబిరాన్ని ఇటీవలే మొవ్వ మండలంలో కూడా నిర్వహించామన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పేద ప్రజలకు ఉచితంగా న్యాయసహాయాన్ని అందించడంతోపాటు ఉచితంగా న్యాయ సలహాలను ఇస్తుందన్నారు. ఈ శిబిరంలో ప్రజలందరూ విరివిగా పాల్గొని ప్రభుత్వ పథకాలను ఉచిత న్యాయ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇంటింటికి తిరిగి దివ్యాంగ బాల బాలికలను గుర్తిస్తున్నామని వారికి కావలసిన ఉపకరణాలను అందించేందుకు న్యాయవ్యవస్థ ద్వారా కృషి చేస్తున్నామన్నారు. శిబిరంలో వివిధ ప్రభుత్వ శాఖలు వారికి సంబంధించిన పథకాలను కార్యక్రమాలను ప్రజలకు వివరించే విధంగా ప్రదర్శనశాలలు ఏర్పాటుచేసి, అందులో ప్రభుత్వ పథకాల దరఖాస్తులు కరపత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే వైద్య ఆరోగ్య శిబిరాన్ని, కార్యక్రమానికి ఎలాంటి అంతరాయము కలగకుండా నిరంతర విద్యుత్తు, ప్రజలకు కావలసిన మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమం నోడల్ అధికారి డిఆర్డిఎ పిడి హరిహరనాథ్ మాట్లాడుతూ వివిధ పథకాల లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి వారికి పంపిణీ చేయవలసిన బ్యాంకు చెక్కులను, మంజూరు పత్రాలను ముఖ్య అతిథుల ద్వారా అందజేసేందుకు ఏర్పాటు చేయాలన్నారు. కొందరు లబ్ధిదారులను ఎంపిక చేసి వారి అభిప్రాయాలను తెలియజేసే విధంగా సిద్ధంగా ఉంచాలన్నారు. విద్యార్థులు, కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమా లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అగ్ని మాపక అధికారి ఏసు రత్నం, బీసీ కార్పొరేషన్ ఇన్చార్జి ఈడి రాజేంద్ర బాబు, వృద్ధులు దివ్యాం గుల సంక్షేమ శాఖ ఏడి కామరాజు, వైద్యశాఖ డిఐఓ డాక్టర్ ప్రేమ్ నాథ్, డిటిడబ్ల్యుఓ విజయశాంతి, ఎస్సీ కార్పొరేషన్ ఈవో పిటి సెల్వి, ఆర్టీసీ డిఎం పెద్దిరాజు, మచిలీపట్నం మున్సిపల్ సహాయ కమిషనర్ గోపాల్ రావు, మైనార్టీ సంక్షేమ అధికారి రబ్బాని, ఉపవిద్యాధికారి శేఖర్ బాబు అధికారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అన్న సంతర్పణ



**వత్సవాయి జూన్ 26 మేజర్ న్యూస్ :** వత్సవాయి మండలం మంగొల్లు గ్రామానికి చెందిన పథకముడి నాగేశ్వరరావు, జగన్మోహన్రావు, రంగా రావులు వారి యొక్క తల్లిదండ్రులు స్వర్గీయ మంగమ్మ వెంకట్రామయ్య జ్ఞాపకార్థం జగ్గయ్యపేట పట్టణంలోని అన్న క్యాంటీన్ కు ఒక రోజు 10 వేల రూపాయలు తో అన్నదానం ఏర్పాటు చేయించారు. ఈ అన్నదానాన్ని శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మంగొల్లు నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం వచ్చినంతనే అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తానని ఇచ్చిన మాట ప్రకారం ప్రారంభించడం జరిగిందని అదేవిధంగా మండల కేంద్రంలో కూడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆలోచనలు చేస్తున్నారని త్వరలో అవి కార్యరూపం దాలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నె నారాయణరావు, బొల్లం పురుషోత్తం, కాకనబోయిన పాండు, బొల్లం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగ్ ల పంపిణీ సంస్థ



**పమిడిముక్కల జూన్ 26 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని ఐనంపూడి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన బ్యాగ్ లు, పుస్తకాలను స్థానిక ప్రజా ప్రతినిధులు విద్యార్థులకు పంపిణీ చేశారు. మండల వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, వైఎస్ఆర్సిపి నాయకులు ఏనుగు వెంకటేశ్వరావు, టిడిపి నాయకులు పరసా రెడ్డిబాబు, ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, స్కూల్ కమిటీ చైర్మన్ చేతుల మీదుగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సౌకర్యాలు అందిపుచ్చుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదిగి గ్రామానికి సేవ చేయాలని కోరారు.

## శీలంకి నివాళులర్పించిన ఎమ్మెల్యే , మాజీ మంత్రి

**పామర్రు జూన్ 26 మేజర్ న్యూస్:** పామర్రు సాయి నగర్ లో నివసిస్తున్న ఉపాధ్యాయుడు శీలం కరుణకుమార్ హఠాన్మరణం చెందగా ఆయన పార్టీవ దేహానికి ఎమ్మెల్యే కుమార్ రాజా, మాజీ మంత్రి రావెళ్ల కిషోర్ లు పూలమాల వేసి నివాళులర్పించారు. కరుణ కుమార్ పెదపారుపూడి మండలం యలమర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రం ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు. ఆయన మృతి పట్ల పాఠశాల ఉపాధ్యాయ బృందం తమ సంతాపాన్ని వ్యక్తం చేసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజాతో పాటు పార్టీ నాయకులు చాట్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పామర్రు టౌన్ లో దైవ సేవకులు గడ్డం చార్లెస్ మరణించగా స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా గురువారం ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్పు పలికారు.

## లోకేష్ కు 'నాగలి' బహుకరించిన గోపు సత్యనారాయణ




### తెలుగు రైతు అధ్యక్షులు అనిపించుకున్నారన్న లోకేష్

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఐటి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు గోపు సత్యనారాయణ నాగలిని బహుకరించారు. ఈ సందర్భంగా గోపు సత్యనారాయణతో లోకేష్ మాట్లాడారు. మొత్తానికి తెలుగు రైతు అధ్యక్షులు అనిపించుకున్నారు అని చలోక్తి విసిరారు. నాగలి చాలా బాగుందని ప్రశంసించారు. జిల్లాలో పంటలు ఎలా పండుతున్నాయి? ముంపునకు గురైన ప్రాంతాల్లో రైతులకు ప్రభుత్వ నష్టపరిహారం చెల్లింపు పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారా? అంటూ లోకేష్ ప్రశ్నించారు. దానికి సమాధానంగా గోపు మాట్లాడుతూ చంద్రబాబు రైతు పక్షపాతి అనడంతో లోకేష్ చిరునవ్వుతో గోపును అభినందించారు. టిడిపి గ్రామ కమిటీల ఏర్పాటు,నూతన కమిటీల ఏర్పాటుపై చర్చించారు. రైతు సమస్యలకు ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందని లోకేష్ అన్నారు.

# అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీస్ శాఖకు మరో మూడు వాహనాలు





ఐజీ అశోక్ కుమార్ చేతుల మీదుగా పోలీస్ శాఖకు అప్పగించిన జీఎస్ రావు

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అవనిగడ్డ నియోజకవర్గంలో వితరణశీలిగా పేరుగాంచిన లిఖిత ఇన్ఫ్రా లిమిటెడ్ అధినేత జీఎస్ రావు అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీసులకు మరో మూడు బొలెరో వాహనాలను సమకూర్చారు.. నాగాయలంక గ్రామానికి చెందిన గడిపాటి శ్రీనివాసరావు ( జీఎస్ రావు) లిఖిత ఇన్ఫ్రా లిమిటెడ్ కంపెనీ ద్వారా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారు.. తన జన్మ స్థానమైన అవనిగడ్డ నియోజకవర్గంలో పోలీస్ అధికారులు మరింత సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు వీలుగా ఆరు పోలీస్ స్టేషన్లు, అవనిగడ్డ, చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయాలకు, అవనిగడ్డ డీఎస్పీ కార్యాలయానికి ఒక్కో బొలెరో వాహనాన్ని సమకూర్చుతానని పోలీస్ శాఖకు హామీ ఇచ్చారు.. ఇప్పటికే నాగాయలంక పోలీస్ స్టేషన్ కు వాహనాన్ని అందించిన జీఎస్ రావు గురువారం మరో మూడు వాహనాలను ఐజీ అశోక్ కుమార్ చేతుల మీదుగా ఎస్పీ గంగాధర్ కు అప్పగించారు.. తాను ముందుగా చెప్పినట్లు 9 బొలెరో వాహనాలకు అదనంగా మరో వాహనాన్ని హైవే పెట్రోలింగ్ కోసం ఇస్తానని ఐజీ అశోక్ కుమార్ కు తెలిపారు.. దీంతో నియోజకవర్గానికి మొత్తం 10 నూతన బొలెరో వాహనాలు సమకూరుతాయని, వీటితో మరింత సమర్థవంతంగా అవనిగడ్డ సబ్ డివిజన్ పోలీసులు విధులు నిర్వహించాలని ఐజీ సూచించారు.. జీఎస్ రావు దాతృత్వం మరింత మందిలో స్ఫూర్తి కలిగిస్తుందని ఐజీ ఆశాభావం వ్యక్తంచేశారు.. అనంతరం ఎస్పీ గంగాధర్‌తో కలసి జీఎస్ రావును ఘనంగా సత్కరించి పోలీస్ శాఖ తరుపున జ్ఞాపికను అందజేశారు.. మరో నెల రోజుల్లో మిగిలిన ఆరు వాహనాలను కొనుగోలు చేసి జిల్లా ఎస్పీకి అందిస్తానని ఈ సందర్భంగా జీఎస్ రావు తెలిపారు.. వరదలు, ఉప్పెనలు తరచుగా వచ్చే అవనిగడ్డ నియోజకవర్గంలో పనిచే పోలీసుల విధి నిర్వహణ మరింత సులువుగా ఉండాలన్న ఉద్దేశంతో రూ.1కోటికి పైగా వెచ్చించి 10 బొలెరోలు అందిస్తున్నట్లు జీఎస్ రావు చెప్పారు. ఆయన వెంట దివి ప్రాంత ప్రముఖులు శీలం అశ్విన్ కుమార్, తుమ్మల చౌదరి బాబు, కోనేరు బలరాం తదితరులు పాల్గొని జీఎస్ రావును అభినందించారు.

# రైతుబజారులో చౌకధరలు అమలయ్యేలా చర్యలు





**దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించేది లేదు..**

**జిల్లాలో 15 రైతు బజార్ల ద్వారా వినియోగదారులకు అమ్మకాలు..**

**జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా**

**ఎన్‌టిఆర్ జిల్లా బ్యూరో, జూన్ 26, మేజర్ న్యూస్ :** రైతు బజార్లలో దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించేంది లేదని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే వినియోగదారులకు కూరగాయలు, నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అధికారులను ఆదేశించారు. నగరంలోని కృష్ణలంక రైతుబజారును గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రైతు పండించిన పంటను నేరుగా వినియోగదారులకు రైతు బజార్ల ద్వారా అమ్మకాలు నిర్వహించి రైతులు, వినియోగదారులకు మేలు జరిగేలా రైతు బజార్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో 15 రైతు బజార్లు ఉన్నాయని వీటిలో విజయవాడ నగరంలో తొమ్మిది, రూరల్ లో ఆరు ఉన్నాయన్నారు. వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్ణయించిన ధరలకే రైతు బజార్లలో అమ్మకాలు నిర్వహించేలా ఎస్టేట్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. బహిరంగ మార్కెట్లలో కంటే రైతుబజార్లలోనే తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలను ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. రైతు బజార్లలో దళారీ వ్యవస్థను ప్రోత్సహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నోటీసు బోర్డులో నమోదు చేసిన ధరలకు వ్యాపారులు, పొదుపు గ్రూపు మహిళలు, రైతులు కూరగాయలు విక్రయిస్తున్నారో లేదోనని ఆమె పరిశీలించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఎలక్ట్రానిక్ కాటాల ద్వారానే విక్రయాలు నిర్వహించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. పరిసరాలను మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, అమ్మకందారులకు, వినియోగదారులకు త్రాగునీటి సౌకర్యాన్ని కల్పించాలన్నారు. రైతుబజార్లలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియా అన్నారు. పరిశీలనలో జాయింట్ కలెక్టర్ వెంట ఎస్టేట్ అధికారి సిహెచ్ జాన్ విక్టర్, రైతుబజార్ సిబ్బంది ఉన్నారు.

# గ్రామీణ స్థాయిలో డిపాజిటర్ల హక్కులు రక్షణపై అవగాహన






**గుడ్లవల్లేరు జూన్ 26 మేజర్ న్యూస్ :** గుడ్లవల్లేరులోని మహిళా సాధికార కార్యాలయం ఆధ్వర్యంలో ఎం.పి.పి. కార్యాలయ ప్రాంగణంలో డిపాజిటర్ ఎడ్యుకేషన్ వర్క్ షాప్ గురువారం ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమాన్ని ఆర్టిడ్స్ (సమీకృత గ్రామీణ గిరిజనాభివృద్ధి సేవా సంస్థ, కట్టేవరం, తెనాలి), రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ డాక్టర్ ఎన్. కాళహస్తి పాల్గొని ఆర్బీఐ నియమాలు, ప్రభుత్వ పథకాలు, రుణాలు, సబ్సిడీపై రుణాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణ వంటి అంశాలపై మహిళలకు స్పష్టమైన అవగాహన కల్పించారు. సమావేశంలో పాల్గొన్న మహిళలతో ప్రత్యక్ష పరస్పర సంభాషణ ద్వారా వారి సందేహాలను నివృత్తి చేశారు. మరో రిసోర్స్ పర్సన్ వసుధ బసవేశ్వర రావు (రిటైర్డ్ చీఫ్ మేనేజర్, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) డిపాజిటర్ల హక్కులు, బ్యాంకింగ్ మోసాలు, డిజిటల్ మోసాలు, కె.వై.సి. అవసరాలు, పొదుపు ప్రాముఖ్యత, డార్మెంట్ ఖాతాల ప్రమాదాలు, మహిళల స్వయం సహాయక సంఘాలు, మైక్రోఫైనాన్స్, భీమా పథకాలు, అటల్ పెన్షన్ యోజన, క్రెడిట్ స్కోర్, రైతులకు పంట రుణాలు, పీఎం కిసాన్, పంటల బీమా తదితర అంశాలపై విపులంగా వివరించారు. డిజిటల్ ప్రపంచంలో మహిళలు మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకింగ్ వ్యవస్థ పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆయన సూచించారు. ఆర్టిడ్స్ కార్యదర్శి యర్రు సాంబశివరావు మాట్లాడుతూ "డిపాజిటర్లకు వారి హక్కులు, రక్షణ చర్యలు గురించి గ్రామీణ స్థాయిలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశం" అని తెలిపారు.కార్యక్రమంలో ఆర్టిడ్స్ రాష్ట్ర సమన్వయకర్త షేక్ హుస్సేన్, ఎ.పి.ఎం. పాండురంగప్రసాద్ పాల్గొన్నారు.

## డాక్టర్ హసీమ్ బేగ్‌కి ఉత్తమ కార్యకర్త అవార్డు






**మంత్రి నారాలోకేష్ అన్న చేతుల మీదుగా అవార్డు అందుకోవడం నా అదృష్టం**

**పార్టీ ప్రతిష్టమరింత పెరిగేలా పని చేస్తా...**

**రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్**

**మచిలీపట్నం/విజయవాడ, మేజర్ న్యూస్ :** మచిలీపట్నం ముఖ్య నాయకులు, ముఖ్య కార్యకర్తలతో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల్లో తనకంటూ రాష్ట్ర స్థాయిలో ఓ ముద్ర వేసిన రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ కి ఉత్తమ కార్యకర్తగా అవార్డు నారా లోకేష్ చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు డాక్టర్ హసీమ్ బేగ్ మాట్లాడుతూ తన ఆనందాన్ని మీడియాతో పంచుకున్నారు. తనకు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ కార్యకర్తగా అవార్డు వచ్చినదానికంటే, తన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్న చేతుల మీదుగా ఆ అవార్డు అందుకోవడం తనకు ఎంతో మహదానందంగా ఉందని, ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తన పార్టీ అభ్యున్నతికి నిరంతరం కార్యకర్త గానే కృషి చేస్తానని, పార్టీ ప్రతిష్టను మరింత పెంచేలా పాటు పడతానని అన్నారు. తనకు వెన్నంటి ఉన్న నేతలు, తోటి కార్యకర్తలందరికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, మాజీ పార్లమెంట్ సభ్యులు ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, కృష్ణాజిల్లా ఇన్చార్జి మినిస్టర్ వాసంశెట్టి సుభాష్, ఏపీ జోనల్ 3 కోఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్సీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కొత్త లేపాక్షి షోరూమ్‌లు

**రాష్ట్రం లోపల, బయట ప్రాంతాల్లో వ్యాపార విస్తరణకు పుష్కల అవకాశాలు**

**సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు వినూత్న ఆలోచనలు**

**లేపాక్షి చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్**



**విజయవాడ, జూన్ 26, మేజర్ న్యూస్ :** రాష్ట్రం లోపల, వెలుపల కొత్త షోరూమ్‌ల ఏర్పాటుతో వ్యాపారాన్ని విస్తరించడంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోనూ కొత్త లేపాక్షి షోరూమ్‌ల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నట్లు ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (లేపాక్షి) చైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. విజయవాడ గాంధీనగర్ లేపాక్షి బిల్డింగ్‌లో ఏపీహెచ్‌డీసీ లిమిటెడ్ 182వ డైరెక్టర్ల బోర్డు సమావేశం జరిగింది. డా. పసుపులేటి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హస్తకళా ఉత్పత్తులకు పెద్దఎత్తున ప్రచారం కల్పించడంతో పాటు వన్ డిస్ట్రిక్ట్ – వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ)లను ప్రోత్సహించడంపై కీలక చర్చ జరిగినట్లు లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ తెలిపారు. లేపాక్షి షోరూమ్‌ల ద్వారా అమ్మకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకొని, హస్తకళాప్రియులకు నాణ్యమైన సేవలు అందిస్తూ కార్పొరేషన్ లాభాల బాటల్లో పయనించేలా వినూత్న కార్యాచరణ చేపట్టడంపైనా చర్చ జరిగినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా లేపాక్షి బ్రాండ్‌కు విస్తృత ప్రచారం నిర్వహించడం, హోర్డింగ్‌ల ఏర్పాటు వంటి అంశాలపైనా చర్చించడం జరిగిందని, ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా అందరి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని సమష్టి కృషితో లేపాక్షిని ఉన్నతంగా నిలిపేందుకు కృషిచేయడం జరుగుతుందని విశ్వ పేర్కొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999